# కరీంనగర్‌లో చెల్లని పొన్నం హుస్నాబాద్‌లో చెల్లుతడా?



ముల్కనూరు రోడ్ షోలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, పక్కన హుస్నాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి సతీశ్‌కుమార్

- వొడితల సతీశ్‌కుమార్ వల్లే హుస్నాబాద్ అభివృద్ధి
- నియోజకవర్గానికి రూ.9వేల కోట్లు
- ముల్కనూర్ రోడ్‌షోలో మంత్రి కేటీఆర్

భీమదేవరపల్లి, నవంబర్ 22 : పొన్నం ప్రభాకర్ సొంత నియోజకవర్గం కరీంనగర్ అని, అక్కడ చెల్లని రూపాయిలా మారిన ఆయన, హుస్నాబాద్ నియోజకవర్గంలో ఎలా చెలుతాడు? అని మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ చౌరస్తాలో హుస్నాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి వొడితల సతీశ్‌కుమార్‌తో కలిసి బుధవారం సాయంత్రం నిర్వహించిన రోడ్‌షోలో మంత్రి కేటీఆర్ ప్రసంగించారు. సౌమ్యుడు, మంచి వ్యక్తి అయిన సతీశ్‌కుమార్, హుస్నాబాద్ నియోజకవర్గానికి ఎన్నో సేవలు అందించారని గుర్తు చేశారు. నియోజకవర్గంలో రూ.9వేల కోట్లకుపైగా నిధులతో అభివృద్ధి, సంక్షేమ పథకాలను పరుగులు పెట్టించాడని చెప్పారు. ఇందులో రూ.5,640 కోట్లు అభివృద్ధి పనుల కోసం, రూ.3,427కోట్లు సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించారని తెలిపారు. స్కూల్‌కు వెళ్లిన విద్యార్థి ప్రోగ్రెస్ కార్డు మాదిరిగానే అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు కార్డును మీ ముందు ప్రదర్శిస్తున్నానని చెప్పారు. వీటిలో ఏవైనా అమలుకానివి ఉన్నాయా చూసుకోవాలని సూచించారు. రూ.2700 కోట్లతో నిర్మించిన గౌరవెల్లి ప్రాజెక్టు మరికొద్ది రోజుల్లో వినియోగంలోకి వస్తుందన్నారు. ఇప్పటికే రెండుసార్లు ట్రయల్ రన్ పూర్తయిందన్నారు. ఒకప్పుడు కరువు కాటకాలతో అల్లాడిన హుస్నాబాద్ ప్రాంతం రానున్న రోజుల్లో పచ్చలహారంగా మారుతుందన్నారు.

### 24గంటల కరెంటు కావాల్నా.. మూడు గంటలా?

కాంగ్రెస్ పార్టీ నాయకుడు రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో 95శాతం బీద రైతులే ఉన్నారని, వారికి 24గంటల కరెంటు వృథా అని రైతులను అవమానకరంగా మాట్లాడుతున్నారని, రాష్ట్రంలో ఎక్కడైనా వ్యవసాయానికి 10హెచ్‌పీ మోటర్ వినియోగించే రైతు ఉన్నాడా అని మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. 'మూడు గంటల కరెంటుతో మూడెకరాలు పండించే రైతులు మీ వద్ద ఉన్నారా' అని రైతులను అడిగి సమాధానం రాబట్టారు. 'మీకు వ్యవసాయానికి 24గంటల విద్యుత్ కావాల్నా, కాంగ్రెస్ అంటున్నట్లు 3గంటలా ఆలోచించుకోవాలి' అని సూచించారు.

### దళారీ వ్యవస్థను అంగీకరిస్తారా?

'ఇక కాంగ్రెస్ మరో నాయకుడు భట్టి విక్రమార్క మాట్లాడుతూ మేము అధికారంలోకి వస్తే ధరణిని రద్దు చేస్తామంటున్నడు. కేసీఆర్ ప్రభుత్వం రైతుల భూములకు రక్షణగా ధరణిని తీసుకొచ్చి పకడ్బందీగా రెవెన్యూ చట్టాలను అమలు చేస్తుంటే ఇప్పుడు కాంగ్రెస్ వాళ్లు ధరణిని తొలగించి మళ్లీ పటేల్, పట్వారీ, దళారీ వ్యవస్థలను ముందుకు తీసుకొస్తామని బాహాటంగా ప్రకటించడం విడ్డూరంగా ఉంది.. ఈ వ్యవస్థను మీరు అంగీకరిస్తారా?' అని జనాలను అడిగారు. 'రైతుబంధు పేరిట డబ్బును వృథా చేస్తున్నారని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అంటున్నారు, ఇప్పుడు ప్రభుత్వం ఇస్తున్న రైతుబంధు డబ్బును మీరు వ్యవసాయ పెట్టుబడి కోసం వినియోగించుకోవడం లేదా?' అని రైతులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులంతా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ముక్తకంఠంతో నినదించారు.

### జనరేటరో.. ఇన్వర్టరో లేకుండా వ్యాపారం జరిగిందా?

సమీపంలో ఉన్న దుకాణదారులను ఉద్దేశించి కేటీఆర్ మాట్లాడుతూ '2014 కంటే ముందు జనరేటరో, ఇన్వర్టరో లేకుండా మీరు వ్యాపారం చేయగలిగిన్రా? అని అడిగారు. ప్రతిఒక్కరి బ్యాంకు ఖాతాలో రూ. 15లక్షలు వేస్తానన్న ప్రధానమంత్రి ఎక్కడికి పోయారని విమర్శించారు. బండి పోతే బండి, గుండు పోతే గుండు హామీలు గుప్పించిన బండి సంజయ్ ఇప్పుడు ఏ మూలలో ఉన్నాడని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌ను కేవలం రూ. 400కే ఇస్తుందని హామీ ఇచ్చారు. వృద్ధులకు పింఛన్‌ను రూ.5వేలకు చేర్చుతామని వివరించారు. దివ్యాంగులకు సైతం రూ.6వేలు ఇస్తామన్నారు. 18ఏండ్లు నిండిన మహిళలకు సౌభాగ్యలక్ష్మి పేరిట ప్రతి నెలా రూ.3వేలు ఇస్తామన్నారు. జనవరి, ఫిబ్రవరిలోనే కొత్త రేషన్‌కార్డులు అందించి ప్రతి తెల్లరేషన్ కార్డుపై ఉచితంగా సన్నబియ్యం అందిస్తామని తెలిపారు. తెల్లకార్డు ఉన్న వాళ్లందరికీ రైతుబీమా తరహా కేసీఆర్ బీమా అమలు చేస్తామన్నారు.



రోడ్‌షోలో ఒగ్గు కళాకారుల విన్యాసాలు, బతుకమ్మలతో తరలివస్తున్న మహిళలు

### కాంగ్రెసోళ్లు పగటికలలు కంటున్నారు : మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి

అధికారంలోకి వస్తామని కాంగ్రెసోళ్లు పగటికలలు కంటున్నారని, వారి ఆశలన్నీ కలలుగానే మిగిలిపోతాయని మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి ఎద్దేవా చేశారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ ప్రగతిపథంలో పయనించడం నిజం కాదా అని మీరే జవాబు చెప్పాలని ప్రజలను అడిగారు. బంగారు తెలంగాణను ఢిల్లీ నాయకుల చేతుల్లో పెట్టి బలవుదామా? అని ప్రశ్నించారు. ప్రతిపక్షాల మాయమాటలను నమ్మవద్దని సూచించారు. కేసీఆర్‌ను మూడో సారి సీఎం చేయాలని, సౌమ్యుడు సతీశ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఒగ్గు కళాకారులు నృత్యాలతో ఆకట్టుకున్నారు. కార్యకర్తలు కేటీఆర్‌పై పూలవర్షం కురిపించారు. రోడ్ షోలో హనుమకొండ జడ్పీ చైర్మన్ మారెపల్లి సుధీర్‌కుమార్, ఎంపీపీలు జక్కుల అనితరమేశ్, సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి, మేకల స్వప్న, జడ్పీటీసీలు వంగ రవి, ఎమ్మెల్యే తనయుడు వొడితెల ఇంద్రనీల్, సర్పంచ్ మాడ్గుల కొమురయ్య, ఎంపీటీసీలు బొల్లంపల్లి రమేశ్, అప్పని పద్మ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మారుపాటి మహేందర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్లు కొత్త తిరుపతిరెడ్డి, శ్రీపతి రవీందర్‌గౌడ్, నాయకులు నవాబ్‌పాషా, మ్యాక లాజరస్, ఏనుగు సత్యవతి, దార్ల శ్రీనివాస్, అప్పని నటరాజ్‌వర్మ, శనిగరం సదానందం, ఎల్తూరి స్వామి, మునిగడప శేషగిరి, గొల్లెన బాలమణి, కండె సుధాకర్, భీమదేవరపల్లి, సైదాపూర్, ఎల్కతుర్తి మండలాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మంత్రి కేటీఆర్ రోడ్ షోకు భారీగా తరలివచ్చిన ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు

### బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్

మంత్రి కేటీఆర్ ముల్కనూర్‌లో నిర్వహించిన రోడ్‌షో సూపర్ సక్సెస్ కావడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. రోడ్‌షోకు భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, సైదాపూర్ మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా తరలివచ్చారు. కార్యక్రమం ఆద్యంతం కార్యకర్తలు ఉత్సాహంగా 'బీఆర్ఎస్ జిందాబాద్, కారు గుర్తుకే మన ఓటు' అంటూ నినదించారు. మహిళలు ఉత్సాహంగా డప్పు కొడుతూ ఉత్తేజం నింపారు. ముల్కనూర్ నుంచి మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మలు, కోలాటాలతో తరలివచ్చారు.

### గెలిపిస్తే మరింత అభివృద్ధి.. - ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్

'9వేల కోట్ల రూపాయలతో హుస్నాబాద్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని సాధ్యమైనంత రీతిలో అభివృద్ధి చేశా. ఈ ప్రాంత చిరకాల వాంఛ గౌరవెల్లి ప్రాజెక్టు దాదాపు పూర్తి కావచ్చింది. ఈ ప్రాజెక్టుతో లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుంది. సీఎం కేసీఆర్ పేదల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకం అందని గడపలేదు. ప్రతిపక్షాల మాయలో పడొద్దు. నన్ను రెండుసార్లు ఎమ్మెల్యేగా ఆశీర్వదించారు. మీ మాటను జవదాటకుండా తొమ్మిదిన్నరేళ్లు నిష్పక్షపాతంగా నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడ్డా. మరోసారి ఆశీర్వదించి నన్ను భారీ మెజార్టీతో గెలిపించాలి' అని అభ్యర్థించారు.

---

## మైక్రో అబ్జర్వర్ల రెండో ర్యాండమైజేషన్ పూర్తి

### హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ, నవంబర్ 22 : హనుమకొండ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల పర్యవేక్షకులు నియమించిన మైక్రో అబ్జర్వర్ల రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీలో సాధారణ పరిశీలకుడు డాక్టర్ గోపాలకృష్ణ, అడిషనల్ కలెక్టర్ మహేందర్ జీ తో కలిసి రెండు నియోజకవర్గాలకు సంబంధించిన ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా మైక్రో అబ్జర్వర్లను కేటాయించారు. 174 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని ఆమె తెలిపారు. వరంగల్ పశ్చిమకు 41 మంది, పరకాలకు 116 మంది మైక్రో అబ్జర్వర్లను కేటాయించినట్లు వివరించారు. మరో 17 మందిని రిజర్వ్‌లో ఉంచామని తెలిపారు.



మైక్రో అబ్జర్వర్ల రెండో ర్యాండమైజేషన్‌లో పాల్గొన్న ఎన్నికల పరిశీలకుడు గోపాలకృష్ణ, జిల్లా ఎన్నికల అధికారి సిక్తా పట్నాయక్

## కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆకలి బతుకులే..

- బీఆర్ఎస్ పాలనలో గడపగడపకూ సంక్షేమం
- ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి
- పరకాల పట్టణంలో ఎన్నికల ప్రచారం

పరకాల, నవంబర్ 22 : ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో పేదప్రజలను పట్టించుకున్న వారే లేరని, మళ్లా కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆకలి బతుకులే మిగులుతాయని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 3,4,16,17,18,19, 20వ వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చల్లాకు మహిళలు బతుకమ్మలు, బోనాలు, మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణలో పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పాలన చేస్తున్నారని, గడపగడపకూ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడిన కొన్నేండ్లలోనే దేశానికే మార్గదర్శకంగా నిలిచిందన్నారు. ఇక్కడి పథకాలను ఇతర రాష్ట్రాలు కాపీ కొడుతున్నాయన్నారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో రాష్ట్రం సుభిక్షంగా మారిందన్నారు. దేశానికే అన్నం పెట్టే దిశగా రైతన్నలు దిగుబడులు సాధిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. కాగా, ఉమ్మడి రాష్ట్రంలో పరకాలలో రోడ్లు గుంతలమయంగా ఉండేవన్నారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత పరకాల రెవెన్యూ డివిజన్‌ను పునరుద్ధరించామని, అంతర్గత రోడ్లు, మౌలిక వసతులను కల్పించుకున్నామని తెలిపారు. ప్రధాన రహదారులను విస్తరించుకుని సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసుకున్నామని, పాలనా భవనాలను కార్పొరేట్ స్థాయిలో నిర్మించుకున్నట్లు చెప్పారు. వంద పడకల దవాఖాన నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. కాంగ్రెస్‌ను నమ్మి ఓటేస్తే నట్టేట మునగడం ఖాయమన్నారు. పరకాలను అన్ని విధాలా అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌కు అండగా నిలువాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత-రామకృష్ణ, వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్ రెడ్డి, చల్లా జ్యోతి, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు మడికొండ శ్రీను, కౌన్సిలర్లు పోరండ్ల సంతోష్, బండి రమాదేవి, పాలకుర్తి గోపి, ఏకు రాజు, నాయకులు బండి సారంగపాణి, చందుపట్ల తిరుపతిరెడ్డి, పాపుశెట్టి వెంకటేశ్వర్లు, దగ్గు విజేందర్‌రావు, పాడి భగవాన్‌రెడ్డి, దామ అనిల్, మార్క రఘుపతి, శనిగరం నవీన్ పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో భారీ బతుకమ్మతో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి